
కథ

# వొదిలెయ్... వొదిలెయ్...

పెద్దిభొట్ల సుబ్బరామయ్య




"ఇట్లా ఎంతసేపని ఊరికే పైకి చూస్తూ పడుకోవడం? చాలా అసౌకర్యంగా ఉంది" అనుకుని కష్టం మీద పక్కకు తిరిగి పడుకున్నాడు అనంతరామయ్య. 'ఇప్పుడు బాగుంది. కొంచెం నయం' అని అనుకున్నాడు. 'కదలకుండా పడుకోండి' అని అనవసరపు ఆలోచనలు పెట్టుకోకుండా కళ్లు మూసుకొని నిద్రపట్టించుకోండి అని సలహాలు... వినీవిని విసుగుపుట్టింది. కదలకుండా ఉండగలగడమే కష్టం... పైగా ఆలోచించకుండా ఎలా ఉండడం? ఆలోచనలు వేరువేరుగా ఉంటాయి? అదీగాక జ్ఞాపకాలంటూ కొన్ని ఉంటాయి. ఏళ్ల తరబడి ఎక్కడో మన మనసులో మారుమూల దాగి ఉండి అప్పుడప్పుడు పైకి తేలుతుంటాయి. మంచి జ్ఞాపకాలయితే మురిపించేవి, బాధకరమైన జ్ఞాపకాలయితే బాధించేవి అనేకం ఉంటాయి. వాటిలో చాలా భాగం ఇంత జీవితం గడిచాక లుప్తమై నశించిపోతాయి కూడా.

ఇంత కాలం గడిచిపోయింది. ఇంత నీరు వంతెన క్రింద ప్రవహించి పోయింది. ఒకప్పటి శక్తీ, చావా ఇప్పుడు లేవు, నెమ్మదిగా స్మృతి కూడా మందగిస్తున్నది. శరీరంలో కదలికలు తగ్గి తన దేహమే తనకు కొంచెంకొంచెంగా బరువనిపిస్తున్నది.

ఊహతెలిసే నాటికి ఉరకలు వేసే బాల్యం. ఆ ఆటలు...ఆ పాటలు అన్నీ తెర మీది బొమ్మల వలె కనుమరుగైపోయాయి. ఆనాటి జ్ఞాపకాలన్నీ కరిగిపోగా నేటికీ ఒక్కటిమాత్రం నిలిచి ఉంది... ఆ అన్నదమ్ములిద్దరూ కవలలు. రాముడు లక్ష్మణుడి కంటే రెండు నిమిషాలు పెద్ద అంతే.. పేద తల్లిదండ్రుల కంటిపాపలు.. వారిలో రాముడు తమ కళ్లముందు నీళ్లలో కొట్టుకుపోయాడు.

తోటి పిల్లలు ప్రవాహంలో, వాగులో కొట్టుకుపోతూ ఉంటే వారిని ప్రవాహపు ఉధృతి నుంచి ఒడ్డుకు చేర్చి కాపాడి తాను మాత్రం జాడలేకుండా కనుమరుగైపోయాడు. తాము నలుగురూ ఒడ్డున నిలబడి కేకలు వేయడం తప్ప ఏమీ చేయలేక పోయారు. ఆ ప్రవాహంలో దూరదూరంగా ఏదో అదృశ్య రాక్షసహస్తం ఈడ్చుకు పోతున్నట్టు వెళ్లిపోతూ చేతులెత్తి అరుస్తూ మాయమైపోయిన దృశ్యం ఇప్పటికీ మనసులో లోపలి పొరల్లో దాగి ఉండి అప్పుడప్పుడూ పైకి తేలి బాధిస్తూ ఉంటుంది. తర్వాత ఆ కుటుంబం ఎటు వెళ్లిపోయింది. లక్ష్మణుడేమైనాడో తెలియదు. వాడైనా పెరిగి పెద్దవాడై ప్రయోజకుడై తల్లిదండ్రులను చూసుకుంటూ ఉండి ఉంటాడా? ఏమో!.. ఆ తర్వాత అరవైఅయిదేళ్లు గడిచిపోయాయి. తన చదువు సంధ్యలు ఉద్యోగం కోసం ఆరాటం...వెదుకులాటలు... వెదికి వెదికి వేసారిన తర్వాత ఒక మోస్తరు ఉద్యోగం... అందులో బరువులు...బాధ్యతలు... పెళ్ళి....పిల్లలు...ఇలా ఇంత జీవితమూ గడిచిపోయింది. చాలా మామూలుగా... సాదాసీదాగా...మొత్తం మీద అమిత డల్‌గా...నీరసంగా నిస్తేజంగా.. చిన్న చిన్న ఆనందాలు... చిన్న చిన్న థ్రిల్స్... చిన్న చిన్న బాధలు..కొంచెం కన్నీరు..ఇలా...

అంతకాలం తన నీడగా తోడుగా తన జీవితంలో పాలుపంచుకున్న భార్య అతి సామాన్య కుటుంబంలో నుంచి ముగ్గురు ఆడపిల్లల చివరిదానిగా తల్లిదండ్రులు పెళ్లి చేసి 'హమ్మయ్య... గుండెలమీద కుంపటిని దింపుకున్నాం' అని నిట్టూరుస్తూ వొదిలించుకోగా తనకు జీవన సహచరిగా వచ్చిన అతి సామాన్య స్త్రీ.




తనను అలరించి ఉన్నంతలో జాగ్రత్తలు పాటించి సంసార నౌకను జీవిత సముద్రంలో ఒడిదుడుకుల పాలు కాకుండా నడిపించిన ఉత్తమ ఇల్లాలు. ఆమె కన్ను మూయడం తనకు ఈ వృద్ధాప్య దశలో ఘోరమైన కష్టమే. అదొక దుర్ఘటన... మామూలు జ్వరం అన్నారు. మామూలు మందులకు తగ్గలేదు. మందులు వాడే కొద్దీ పరిస్థితి జటిలంగా మారింది. పెద్ద ఆసుపత్రికి తీసుకువెళ్లవలిసి వచ్చింది. 'ఐ సి యు' అన్నారు. ఎవరినీ లోపలికి వెళ్లనివ్వలేదు. ఎవరినీ చూడనివ్వలేదు. ఎవరినీ మాట్లాడనివ్వలేదు. ఆరోగ్యపరిస్థితి ఎట్లా ఉందో ఒక్కమాటైనా చెప్పలేదు. అంతా నిశ్శబ్దమే...ఇరవై రోజులు లోపల ఉంచి వేలకు వేలు గుంజి ఇరవై ఒకటో రోజున తీసుకెళ్లమన్నారు.

అంతటితో జీవితంలోని అతి ముఖ్యమైన ఘట్టం ముగిసిపోయింది. తానే ఒంటరివాడైపోయాడు. అయిన వాళ్లు, కడుపున పుట్టినవాళ్లు ఓదార్చారు. కాని ఎవరి బ్రతుకులు వాళ్లవి., ఎవరి ఉద్యోగాలు.. ఎవరి సంసారాలు..ఎవరి తాపత్రయాలు...వారివి. తననెవరు పట్టించుకుంటారు ఎల్లప్పుడూ? ఆ మాట తనతో అనేశారు కూడా.

ఒంటరితనం మహా సాగర గర్భంలాంటిది. అక్కడ ఏమీ ఉండదు. అంతా భయంకరమైన ప్రశాంతత.. కాని ఏ క్షణంలో ఏ భయంకర జలరాక్షసి నోరు తెరుచుకుని వచ్చి మింగుతుందో తెలియదు. అసలు ఆ భయంకర నిశ్శబ్దమే చాలు మనిషిని చంపడానికి. అటువంటి దారుణమైన ఒంటరితనం అనుభవించవలసి వచ్చింది. ఎవరైనా పలుకరించినా, నాలుగు మాటలు మాట్లాడినా అంతా తాత్కాలికమే, క్షణికమే. పైగా తానున్న చోట అంతా పరాయివాళ్లు, తానేమో ఒక విశ్రాంత సాహిత్య జీవి, అధ్యాపకుడు, చుట్టూ అందరూ పూజారులు, వ్యాపారస్థులు. పూజారులకు అష్టోత్తరశతాలు సహస్రనామాలు తప్ప సాహిత్య వాసన అనేది ఉండదు. అది వారికి గిట్టదుకూడా. వ్యాపారస్థులకు లాభాలు, భేరాలు, అమ్మకాలు తప్ప మరొకటి పట్టదు.


ఇటీవలి కాలంలో తన ఒంటరితనంతో తాను పోరాడుతున్నప్పుడు పోరాడి పోరాడి అలిసిపోతున్నప్పుడు... ఎప్పటిదో ఒక పాత పరిచయం తటస్థపడింది. ఏనాటిదో తనకు గుర్తేలేని పాత పరిచయాన్ని తిరగదోడి నెమ్మదిగా రాకపోకలు

సాగించి దగ్గరై తనకు మళ్లీ జీవిత స్పృహ కలిగించింది సరళ. తన మీద సానుభూతి చూపుతూ తనను గెలిచింది. తాను ఆమెను నమ్మి చాలా దూరం ప్రయాణించాడు. తనను గురించి చాలా చెప్పుకున్నది. దానితో ఆమె ఒక అపురూప ప్రేమైక జీవి అని నమ్మాడు. ఆమె తన వారికోసం సర్వం త్యాగం చేసిన త్యాగమూర్తి అని నమ్మాడు. దరిజేరనిచ్చాడు.. తన చుట్టూ అమిత నేర్పుతో ఒక వల పన్నుతున్నదని గ్రహించలేకపోయాడు. కాలం గడిచేకొద్దీ తనను దోచి తన దగ్గర ఇంక ఏమీ లేదని తెలుసుకున్న తర్వాత తనను 'కాలిన ఇటుకరాయిని చేతుల్లోనుంచి వదిలేసినట్టు' వదిలేసి వెళ్లిపోయింది. మళ్లీ తన ఒంటరితనం తనకు మిగిలిపోయింది. మునుపు రాత్రిళ్లు మాత్రమే అసౌకర్యంగా..భయంగా..బాధగా గడిచేవి. ఇప్పుడు పగళ్లు గడవడం కూడా బాధగా ఉంటున్నది.

ఒక మిత్రుడు సలహా ఇచ్చాడు! వొదిలేయ్.. అన్నీ వదిలేయ్... అన్నీ వదిలేసుకుంటే అప్పుడు ప్రశాంతంగా ఉంటుంది! అన్నాడు.

'ధ్యానం...ధ్యానంచెయ్.... మనసును పట్టుకో..!' అన్నాడు లేని ప్రయత్నం చేశాడు కొన్నాళ్లు. కాని మనసును పట్టుకోవడం సాధ్యమా? పట్టుకున్నామని చెప్పేవాళ్లు నిజమే చెబుతున్నారా? ఏ ఆలోచనలూ లేకుండా ఉండాలంటే నిజంగా కుదురుతుందా ఎవరికైనా? 'వదిలెయ్యడం పద్ధతి బాగుందనిపించింది. తాను ఊహ తెలిసినప్పటి నుంచి వొదిలెయ్యడం అభ్యసించాడు ఆటల్లో ఎదుటి వాడెవడైనా మొండి చేస్తే 'పోన్లే పాపం' అని వొదిలేసేవాడ. తమ్ముడు తనను దౌర్జన్యంగా గెంటివేసి ఇల్లు ఆక్రమించుకుంటే అప్పుడు కూడా 'పోన్లే పాపం... తోడబుట్టినవాడు. వాడితో గొడవెందుకు?' అని వదిలేశాడు. ఎప్పటిదో ఇక్ష్వాకుల కాలం నాటి మాన్యం పల్లెటూళ్లో అయిదు ఎకరాలు ఉంటే కౌలు చేసేవాడు పక్కపొలాల వాళ్లు కుమ్మక్కై ఆక్రమించుకుని జబర్దస్తీ చేస్తే కూడా 'ఎక్కడ పోరాడి చావగలం' అని వదిలేశాడు. ఇక చేస్తున్న ఉద్యోగం మొదట్లో బాగాలేక దాన్ని వదిలేశాడు. మళ్లీ ఉద్యోగంలో పైవాడితో కష్టాలు పడలేక వదిలేశాడు. అట్లా జీవితమంతా ఉద్యోగాలు మారుతూ ఎక్కడా స్థిరంగా నిలవక దొర్లుడు పుచ్చకాయలాగ గడిపాడు. కుదురులేని బ్రతుకైపోయింది. దానితో వయసు పైబడి ఓపిక తగ్గేనాటికి ఏ భద్రతా లేకుండా అయిపోయింది. ఉంటున్నది చిన్న గదిలో... అదీ ఆ ఇంటి యజమాని దయతలచి ఇచ్చినది.. మళ్లీ చిన్న ప్రెస్ మజమాని దయతలచి ఇచ్చిన ప్రూఫ్ రీడర్ పని... ఇంట్లో అదే గదిలో .. రెండు మూడు పంచెలు మూడునాలుగు అరచేతుల చొక్కాలు.. ఒక కుర్చీ వంటి అత్యవసరమైన సామగ్రి... అంతకు ముందే కొంచెం అవసరం అనిపించిన వస్తువులను 'వదిలెయ్... వదిలించుకో...!' అనుకుంటూ ఎవరికో ఇచ్చేశాడు.

ఇప్పుడు అయిన వాళ్లు ముందు వదిలిపోయారు. కాదు.. ఈయనే వాళ్లను వదిలించుకున్నాడు. కడుపున పుట్టిన వాడు కూడా నెమ్మదినెమ్మదిగా ఈ వ్యర్థజీవిని దూరంగా ఉంచడంతో ఈయన వాణ్ని కూడా వొదిలించుకున్నాడు. ఇప్పుడిక ఏ సంబంధాలూ మిగలలేదు.




ఇప్పుడు కదలిక తగ్గింది. పడుకుని పైకి చూస్తున్నాడు రోజుల తరబడి... కళ్లవెంట నీళ్లు కారుతున్నాయి అనేకంగా... కుడిచెయ్యి పడిపోయి చాలా రోజులయ్యింది. కాళ్లు రెండూ పనికి రాకుండా పోయి నెలరోజులు దాటింది. నెమ్మదిగా స్మృతి శక్తి కూడా సన్నగిల్లిపోతున్నది. నిన్న తన భార్య పేరు గుర్తుకురాక తల్లడిల్లిపోయాడు. కొంతసేపు బాధపడి 'పోన్లే వదిలేయ్' అనుకున్నాడు. ఇప్పుడు భుజం కింద చీమ ఒకటి కుట్టింది. ఈ చీమలు ఎంత చిన్నవంటే ఒక్కొక్కటి ఇసుకరేణువంత కూడా ఉండవు. పాకుతున్నట్టున్నాయి, చురుక్కుమనిపిస్తున్నాయి. కాని, కొద్ది సేపటి నుంచి 'చురుక్కు' తగలడం లేదు. ఆ బాధకూడా తెలియడం లేదు.

ఇల్లుగలాయనకు ఈయన మీద మహా సానుభూతి. అప్పుడప్పుడు వచ్చి చూసిపోయేవాడు. పక్కభాగంలో ఉన్న వారితో 'కాస్త కనిపెట్టి ఉండండి... ఏ క్షణంలోనైనా ముంచుకు రావచ్చు... ముందుగా బయట పడేద్దాం ' అని చెప్పించాడు కూడా.

కొంతసేపటి కిందట ఆయన వచ్చి చూస్తే అనంతరామయ్య కళ్లు తెరుచుకునే ఉన్నాయి. గుండె మాత్రం కదులుతున్నది. లోలోపల ధ్వని.. వొదిలేయ్...వొదిలేయ్... నీదికాదీ లోకం... ఈ భూమిలో చెట్టూ చేమలు...గాలీ మబ్బులూ... ఈ జీవులు ఏవీ నీవి కావు. ఇప్పటి వరకు ఈ శరీరం నీది... కాని కాస్సేపటి తర్వాత ఈ శరీరం కూడా నీది కాదు... వదిలేయ్... ఇటీవల ఈ చెయ్యి నీది కాకుండా పోయింది. కాళ్లెప్పుడో పోయాయి. నీ కళ్లెప్పుడో వదిలేశావు. నీ బాడీ కూడా ఎవరికీ ఏ బాధా లేకుండా వొదిలేలా చేసుకున్నావు. కాస్సేపటిలో వారు వచ్చి అరగంటలోగా నీ కళ్లు తీసుకుపోతారు. ఆరుగంటల్లో మరొకళ్లు వచ్చి నీ బాడీ తీసుకుపోతారు. ఇక ఆలోచనలు మిగిలి ఉన్నాయే వాటిని వదిలేయ్... అన్నీ వదిలేసుకుంటూ పో... అప్పుడే.. నీకు స్వేచ్ఛ... ఈ కట్టె నీది కాదనుకుని వొదిలించేసుకుంటావ్... నీది అనేదే ఉండదు. నువ్వూ ఉండవు. ఈ కాళ్లూ చేతులు తల వగైరా అన్నీ వదిలించేసుకో...! లోపల మనసులో తన చిన్నప్పటి ఊరుచివరి కొలను... అందులో తామరలు... గాలిలో తేలివస్తున్న స్వరం... మబ్బులు నిండిన ఆకాశం రివ్వున ఎగిరిపోతున్న ఏదో పక్షి... దాని వికృతమైన కూత. కళ్లు లేని తన ముఖం.. ముక్కలు ముక్కలుగా మెడికల్ కాలేజీ బల్లలమీద తన శరీరం. దాన్ని పరిశీలిస్తున్న ముఖాలు. ఏ పనీ లేకుండా అనవసరంగా మరో తెలియని ఊరు వెళ్లొస్తున్న భావన... తర్వాత అంతా చీకటి వంటి శూన్యం... తర్వాత ఏమీలేదు... లోపలి వ్యధ చివరకు శాంతి లభించింది... పక్కభాగంలో ఆయన గబగబా వచ్చి ఇంటి యజమానితో ' అంతా అయిపోయినట్టుంది... రండి...రండి..!' అన్నాడు.

*